జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 1 సంచిక : 2

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శుభకృత్ భాద్రపద మాసం - సెప్టెంబర్ 2022



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# “శంభోర్మూర్తి శ్చరతి భువనే శంకరాచార్య రూపా”

2018లో శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీస్వామివారు శ్రీ ప్రయాగ రామకృష్ణగారికి ఇచ్చిన ఇంటర్వ్యూ..

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : గురుదేవులకు నమస్కారము. మూలామ్నాయ సర్వజ్ఞ కంచికామకోటిపీఠం గురించి తెలియజేయమని ప్రార్థన.**

**స్వామివారు :** 'శంభోర్మూర్తి శ్చరతి భువనే శంకరాచార్య రూపా' అని చెప్తాము. కైలాసంలో ఉండే పరమేశ్వరుడు ఈ లోకాన్ని అనుగ్రహించాలని, ధర్మప్రచారం చేయాలని, ఈ కలియుగంలో మనుషుల మనస్సులో ఉండే చెడ్డ అలవాట్లు, ఆలోచనలలో మార్పుతెచ్చి సన్మార్గపు ప్రవృత్తి కలిగించాలనే ముఖ్యదృష్టితో, జ్ఞానోపదేశం ద్వారా అవతార ప్రయోజనం కలిగించాలని, పూర్వయుగములలో సంహారము మరియు ఇతర పద్ధతులలో భగవానుడు అవతారమెత్తినట్టుగా ఆదిశంకరాచార్యులుగా అవతారం ధరించారు.

యుగములు వేరైనా భగవానుని లక్ష్యం 'యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత అభ్యుత్థానం అధర్మస్య తదాత్మానం సృజామ్యహం'. ఈ కలియుగములో పరమశివుడు అవతరించి సాధించిన పద్ధతి, ఆయన అనుసరించిన విధానము వేరు. జ్ఞానోపదేశం ద్వారా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ధర్మబద్ధంగా, సక్రమంగా పనిచెయ్యటానికి, సత్ప్రవృత్తి కలిగించటానికి గురువుగా అవతరించారు.

శంకరాచార్య స్వరూపాన్ని భగవంతుడు, గురురూపంగా స్వీకరించారు. 'ఈశ్వరో గురురాత్మేతి' అనే దానిని సత్యం చేసినారు. ఆ గురుస్వరూపం కేరళ రాష్ట్రంలోని కాలడిలో అవతరించినది. ముప్ఫైరెండు సంవత్సరాల లోపల ఈ భారతదేశమంతా పూర్తిగా మూడుసార్లు పాదయాత్ర చేసారు. సప్తమోక్షపురములలో దక్షిణభారతదేశంలో ఉన్న ఏకైక మోక్షపురి, (అయోధ్యా మధురామాయా కాశి కాంచీ అవంతికా పూరీ ద్వారవతీ) శ్రీచక్రరాజ నిలయ, సుధాసాగర మధ్యస్థ, ఓడ్యాణపీఠ నిలయ అయిన శ్రీకామాక్షిఅమ్మవారి సన్నిధిలో యంత్రరాజమైన శ్రీచక్రమును ప్రతిష్ఠింపచేశారు ఆదిశంకరులు. ఆ పీఠ పరంపరలో మన ఆచార్యులందరూ ఇలా ధర్మప్రచారం కావిస్తున్నారు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : ఆమ్నాయ అంటే స్వయం ప్రతిపత్తి అంటారు. మరి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠం అంటే ఏమిటో వివరిస్తారా?**

**స్వామివారు :** భగవత్పాదాచార్యులు శ్రీ ఆదిశంకరులు కంచికి వచ్చినప్పుడు సర్వజ్ఞ పీఠారోహణ కార్యక్రమం జరిగింది. ఆయన ఈ ప్రపంచాన్ని, అందరి మనసులను తెలుసుకున్నవారు. న్యాయబద్ధమైన, వేదసమ్మతమైన, శాస్త్ర విరోధం లేని, అందరి కోరికలను తపస్సు ద్వారా ఫలింపజేసి, అందరి మనస్సులు రంజింప చేసి, సర్వానందదాయకులైనవారు మన శంకరాచార్యులు. రాములవారిని 'జగదానందకారక' అని ఏవిధంగా చెబుతామో అలాగే శంకరాచార్యులవారు కూడా జగత్తునకు ఆనందాన్ని ఇచ్చినవారు. పండితులు, పామరులు అనే తేడా లేకుండా అందరికీ ఆనందాన్ని వారి బోధనల అనుగ్రహం ద్వారా పంచారు. 'స్త్రీ బాల వృద్ధ బుధ పామర నిర్విశేషం ఆనందయంతం అఖిలం ప్రణమామి నిత్యం'.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : సనాతనధర్మం, వైదికధర్మం, హిందూధర్మం ఇవన్నీ ఒకటేనా ? తేడాలేమైనా ఉన్నాయంటారా ?**

**స్వామివారు :** ఒకే విషయమే ! లోక వ్యవహారం కోసం మనం హిందూమతం అనే పేరు వాడుతున్నాం. అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా అంటాం, ఇక్కడ బహిర్ముఖ సులభా 'హిందూ' అనే శబ్దం. సనాతనధర్మం అని పలకటానికి బదులుగా తేలికగా, సులభంగా ఉందని 'హిందూ' అని వాడతాం. సనాతనం అనే పదమే ప్రాచీనమైనది. 'ఏష ధర్మః సనాతనః' అని శాస్త్రవాక్యం.

ఒకసారి జస్టిస్ ఇస్మాయిల్ అనేవారు పరమాచార్యులవారితో కంచిమఠంలో సాయంకాలం పూట మాట్లాడారు. 'స్వామి మీ ధర్మానికి ఏమి పేరు' అని అడిగారు ? దానికి జవాబుగా పరమాచార్యస్వామి ఏ పేరు మా మతానికిలేదు. పేరు లేని మతం అని చెప్పారు. అప్పుడు ఇస్మాయిల్‌గారు హిందూమతం అనే పేరు ఎందుకు వచ్చింది అని పరమాచార్యులవారిని అడిగారు.

అప్పుడు పరమాచార్యులవారు ఇలా చెప్పారు. ఇతర కొత్త మతాలు వచ్చిన తర్వాత సనాతనధర్మానికి ఏదో ఒక పేరు లేదా సంకేతం లేదా నామకరణం అవసరం అయింది. ఆ సందర్భంలో హిందూమతం అనే పేరు వచ్చింది. అప్పుడు ఇస్మాయిల్‌గారు ఇలా అడిగారు "మీరు ఈ మతానికి ఏదైనా పేరు చెప్పదలుచుకుంటే, ఏ పేరు ప్రతిపాదిస్తారు"? అని. ఆ ఇస్మాయిల్‌గారు కంబ రామాయణంలో గట్టి పండితులు. చీఫ్ జస్టిస్‌గా మద్రాస్ హైకోర్టులో పనిచేశారు. ఆయన పూర్తి పేరు ఎమ్.ఎమ్.ఇస్మాయిల్.

అప్పుడు పరమాచార్యులవారు ఒక పుస్తకం తెప్పించారు. దానిలో ఉన్న పేరును ఇస్మాయిల్ గారికి చూపించారు. ఇది భారతంలో ఉంది. మన శాస్త్రంలో ఉంది. 'ఏష ధర్మః సనాతనః' అనేది చూపించి, ఏదైనా పేరు చెప్పదలుచు కుంటే మనం సనాతనధర్మం అని చెప్పవచ్చు అని చెప్పారు. ప్రాచీన పేరు సనాతనధర్మం, ప్రచారనామం, అందరికీ గుర్తుకు వచ్చే హిందూమతం.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : ఈ అద్వైత సిద్ధాంతం ఆదిశంకరులకు ముందే ఉందా ? లేక శంకరులు దీనిని కొత్తగా ప్రవేశపెట్టారా ?**

**స్వామివారు:** ప్రవేశ పెట్టలేదు. ప్రకటింపచేశారు. ప్రతిపాదించారు. అంతే కానీ, అద్వైతమనేది ఆయన సొంత అభిప్రాయం కాదు. వేదం యొక్క రహస్యం అద్వైతం. 'ఐదంపర్యం చకాస్తి నిగమానాం' ఉపనిషత్తుల యొక్క తాత్పర్యం అద్వైతం. వేదం, ఉపనిషత్తుల యొక్క సరైన అర్థం అద్వైతం. దానిని ఆయన ప్రకాశింప చేశారు తప్ప ఆయన కొత్తగా ఉత్పత్తి చేయలేదు. నిర్మాణం చేయలేదు. వేదానికి ఒక్కొక్కరూ ఒక్కొక్క అర్థం చెప్పారు. వారి సొంత అభిప్రాయాలకు వేదం అన్న పేరు పెట్టారు. లేక వారి సొంత అభిప్రాయానికి వేదం అంగీకారం ఉందని చెప్పేవారు. అప్పుడు శంకరులు, ఎవరెవరు సరైన అర్థం చెప్పలేదో వాటిని నిరసించి, అద్వైతమే ఉపనిషత్తు యొక్క సరైన అర్థం అని ప్రతిపాదించారు.

వేదాలకి, శాస్త్రాలకి, ఉపనిషత్తులకు అర్థం చెప్పటం వరుకూ బాగానే ఉంది, కానీ వేరొక మతం సరికాదు, శూన్యవాదం సరికాదు అని మీరు ఎందుకు చెపుతున్నారు? అని ఆదిశంకరులను కొందరు అడిగారు.

దానికి సమాధానంగా ఆదిశంకరులు ఇలా చెప్పారు. ఒక ప్రసిద్ధమైన వ్యక్తి వేదాలకు, శాస్త్రాలకు ఇదే సరైన అర్థం అని చెప్తే, అమాయకులైన ప్రజలు దానినే నిజమని నమ్మేస్తారు. ప్రజలు నమ్మితే మీకేమైంది ? అని మీరు నన్ను అడిగినట్లైతే, నా వివరణ వినండి అని ఈ క్రింది విధంగా వివరించారు.

వేదాలు ఎందుకు ఉన్నాయి?, అందరికీ సుఖం, శాంతి, ఐశ్వర్యం కలగాలి, సౌజన్యంగా ఉండాలి. ఎవరో ఒక ప్రసిద్ధమైన వ్యక్తి చెప్పారని వేదానికి సరైన అర్థం తెలుసుకోకపోతే ప్రజలకు జరగవలసిన శ్రేయస్సు, మంచి జరగదు. 'అనర్థం చెయ్యాత్, నిశ్శ్రేయసాత్ విహన్యేత'. ప్రజోపకారం కోసం, అద్వైతమే సరైన భావం, శబ్దార్థము కూడా అని చెప్పారు. శంకరులు అద్వైత ప్రకాశకులు మాత్రమే, అద్వైత స్థాపకులు కాదు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : అద్వైతం అంటే ఏమిటో అందరికీ అర్థం అయ్యేలా చెప్పండి !**

**స్వామివారు :** 'సర్వం ఖల్విదం బ్రహ్మ, బ్రహ్మ సత్యం జగన్మిథ్య, ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'. అందరిలో ఉండే ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడమే అద్వైత పరమార్థం.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : శివ, కేశవ అభేదం అద్వైతంలో ఉందా?**

**స్వామివారు :** శివ, కేశవ అభేదం మాత్రమే కాదు. ఎంతమంది దేవతలైనా అభేదం. అందరు దేవతలూ ఒకే పరమాత్మకు వివిధరూపాలు అని అర్థం. పంచాయతనం అంటే 'ఆదిత్యం అంబికాం విష్ణుం



గణనాథం మహేశ్వరం'. ఏ స్వామినైనా మనం మధ్యలో పెట్టి పూజ చేసుకోవచ్చు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : మీరు మీ గురుదేవులు జయేంద్ర సరస్వతీస్వామివారు అదృష్టంకొద్దీ చాలాప్రేమతో నాతో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. అప్పుడు నేను గమనించాను, మీరు నారాయణ నారాయణ అంటుంటారు. శివుణ్ణి ఆరాధించే వాళ్ళను శైవులు అంటారు కదా ! మీరు విభూతి నామాలు పెట్టుకొని ఉంటారు కదా ! మరి నారాయణ నారాయణ అని ఎందుకు అంటారు?**


**స్వామివారు :** 'అంతః శాక్తః, బహిః శైవః, వ్యవహారే చ వైష్ణవః'. అంతః శాక్తః అంటే ధ్యానం అమ్మవారిది, బహిః శైవః అంటే నుదిటిపై విభూతి ధరించటం, వ్యవహారే చ వైష్ణవః అంటే సంభాషణం, ఆశీర్వచనంలో నారాయణుని తలుచుకోవటం. శంకరాచార్యులవారు ఈ మూడు చేసేవారు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : ప్రారంభ దశలో ఉన్నవారికి అద్వైత సిద్ధాంతం గురించి తెలుసుకోవాలంటే మీరు సూచించే అద్వైత సిద్ధాంత ప్రాథమిక గ్రంథాలు ఏమిటి ?**

**స్వామివారు :** 'సర్వవేదాంత సిద్ధాంత గోచరం తం అగోచరం, గోవిందం పరమానందం సద్గురుం ప్రణతోస్మ్యహం' అని శంకరాచార్యులు తమ గురువుగారైన గోవింద భగత్పాదులవారిపై ఈ శ్లోకాన్ని వ్రాశారు. సర్వవేదాంత సిద్ధాంత సారం వివేకచూడామణి, భజగోవింద స్తోత్రం, ప్రకరణ గ్రంథాలు, శంకరాచార్యులవారి రచనలు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : నాకు తెలిసినంతవరకు సమాజంలో సంబంధాలు మూడురకాలు. ఒకటి జ్ఞానికి జ్ఞానికి మధ్య, రెండు అజ్ఞానికి అజ్ఞానికి మధ్య, మూడు జ్ఞానికి అజ్ఞానికి మధ్య. జ్ఞానికి జ్ఞానికి మధ్య సంబంధం సర్వోత్కృష్టమైనది. అజ్ఞానికి అజ్ఞానికి మధ్య సంబంధం ఏ మాత్రం ప్రయోజనం లేనిది. జ్ఞానికి అజ్ఞానికి మధ్య సంబంధం కొత్తల్లో కొంత ఇబ్బందే ! రాను రాను అది క్రమ పరిణామ వికాసం చెందుతుంది అనుకుంటున్నాను. అలా గురువు యొక్క స్థానం అజ్ఞానిని జ్ఞానిని చేసేందుకు, అధోగతి నుంచి ఊర్ధ్వగతిలోకి మనిషిని పరకాయ ప్రవేశం చేయించేందుకు సమాజంలో గురువు ఒక్కరే మార్గం ! గురువు యొక్క స్థానం చెప్పండి !**

**స్వామివారు :** 'కో గురుః ? 'అధిగత తత్త్వః శిష్యహితాయ ఉద్యతస్సతతం' అని శంకరాచార్యులు చెబుతున్నారు. ఎవరైతే భక్తులు, శిష్యులు ఉన్నారో వారి ఐహిక పారమార్థిక సుఖం కోసం, శాస్త్రీయ సామాజిక పద్ధతులని ఏర్పాటు చేసి, వారికి పుణ్యము సంతోషము కలిగించటానికి 'ఉదర నిమిత్తం బహుకృతవేషః' అంటాం కదా! అశనా



పిపాసా అని రెండు పెద్ద వ్యాధులు. వాటినే ఆకలి, దాహం అంటాం. అవి తీరేందుకు మార్గం చెప్పాలి. దానితోపాటు మనస్సు నిండి ఉండాలి. మనస్సు నిండి ఉండటానికి సన్మార్గాన్ని అలవాటు చెయ్యాలి. అది క్రమక్రమంగా చెప్పాల్సిన అవసరం కొందరికి ఉంటుంది. కొందరికి పుట్టుకతోనే 'అహం మనురభవం సూర్యశ్చ గర్భయేవైతచ్ఛయానో వామదేవ ఏవం ఉవాచ' జ్ఞానసంబంధం ఉంటుంది. (జ్ఞానసంబంధర్ అని తమిళనాడులో ఒక జ్ఞాని ఉండేవారు) అలా భక్తులు, శిష్యులు యొక్క అవసరం, శక్తిసామార్థ్యాలు, యోగ్యత చూసి సమయాను గుణంగా, శాస్త్రానుగుణంగా పద్ధతులను నిర్ణయం చేసి వారి ఐహిక, పారమార్థిక సుఖంకోసం ప్రయత్నం చేయటం గురువు యొక్క ముఖ్య కర్తవ్యం.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ: మంత్రోచ్చారణలో బీజాక్షరాలు ఉంటాయి అంటారు. ఉదాత్త అనుదాత్తాలు ఉంటాయి అంటారు ?**

**స్వామివారు :** ఉంటాయి. మంత్రోచ్చారణకి రెండు మూడు బలాలు అవసరం. ఒకటి 'ఆచార హీనం న పునంతి వేదాః' మంత్రోచ్చారణ చేస్తున్నప్పుడు స్నానం, సంధ్య, ఆత్మగుణాలు, అసూయద్వేష రహితమైన, కామక్రోధలోభ మదమాత్సర్య రహితమైన, సాధన చతుష్టయంతో కూడిన మనస్సు ఉండాలి. అప్పుడే ఆ మంత్రము పూర్తిగా మనకు

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** మీ గురువులను తలచుకుని వారి గురించి ఏమైనా చెప్పండి !

**స్వామివారు:** ఉత్సాహం, ఉద్వేగం, ఉపకారం. మా గురువులు జయేంద్రులు ఎన్ని పనులున్నా, నిద్రలేకపోయినా, నిర్విరామంగా పనిచేస్తున్నా, భక్తులను చూస్తున్నప్పుడు వారికి ఎంతో ఉత్సాహం. ఎవరైనా ఏ చిన్న మంచిపని చేస్తున్నా, పాతగుడిని జోర్ణోద్ధరణ చేస్తున్నా, ఏదైనా ఆశ్రమం కడుతున్నా, వికలాంగుల కోసం సహకారం చేస్తున్నా, అనాథలకు ఏమైనా చేస్తున్నా, వేదపాఠశాల కడుతున్నా వారికి ఎంతో సంతోషంతో ప్రోత్సహించాలనే ఉద్వేగం.

దానితో పాటు ఎవరైనా మంచిపనులు చేస్తుంటే వారికి మంచిమాటలు చెప్పటం, ప్రోత్సహించటం ఉపకారం చేయడం, అనుద్వేగకరమైన వాక్యాలు చెప్పటం. మాటని మంత్రంలా ప్రయోగించటం ఆయనకు ఆభరణంలాగా అమరిన విద్యలు.



ఫలితాన్ని ఇస్తుంది.

రెండవది ఉదాత్తం, అనుదాత్తం, స్వరితం, ప్రచయం అని ఉంటాయి. వాటి ప్రకారం ఉచ్చరించాలి. ఋగ్ యజుర్ సామ అధర్వణ వేదాల ప్రకారం వాటి ప్రయోగం వేరువేరుగా ఉంటుంది. "ప్రాతిశాఖ్యం" అని ఉంటుంది. ఆ ప్రాతిశాఖ్యం ప్రకారం ఆ ఉచ్చారణలు (అల్పప్రాణం, మహాప్రాణం) ఉండాలి. దాంట్లో కూడా గట్టిగా చెప్పవలసినవి గట్టిగా, మంద్రస్థాయిలో చెప్పవలసినవి మంద్రస్థాయిలో చెప్పాలి. కొన్ని మనస్సులోనే చెప్పుకోవాలి. అలా ధ్వని, స్వరం, మనస్సు ఈ మూడు చాలా ముఖ్యం.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** ఈ విధంగా చేసినప్పుడు ఆ మంత్రానికి సంబంధించిన అధిష్ఠానదేవత పలుకుతుందా?

**స్వామివారు:** ఆ ! పలుకుతుంది. పలుకుతుంది అంటే ఫలితాలను అనుగ్రహిస్తుంది. దేవతలతో మనుష్యులు మాట్లాడారా ? మాట్లాడే అధికారం, అవకాశం ఉందా? అని 'దేవతాధికరణం' అనే బ్రహ్మసూత్రంలో ఫలానా కారణాల చేత దేవతలు మహాత్ములతో మాట్లాడారు అని శంకరాచార్యులవారు సూచించారు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** మీరు ఇప్పుడు మనస్సు నిర్మలంగా ఉండటం, అంతఃకరణ శుద్ధి, తేటతెల్లంగా ఉండటం అని అన్నారు.

**స్వామివారు:** 'రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్య మనోయథా' – నిశ్చలమైన నిర్మలమైన తటాకములోని నీళ్ళవలె మంచి వ్యక్తుల మనస్సు అంతఃకరణశుద్ధితో ప్రసన్నంగా ఉంటుంది. **'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ సాధ్వాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే'.**

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** ఉద్వేగాలు, ఉద్రేకాలు, కోపాలు ప్రదర్శించకుండా, ఎదుటివారికి కష్టం రాకుండా మాట్లాడాలి. భారతంలో కూడా ధర్మం అంటే ఏమిటో చెప్పారు. ఇతరులు ఏమి చేస్తే నీకు హాని, బాధ కలుగుతుందో, నువ్వు ఇతరులకు అది చెయ్యకుండా ఉండటం ధర్మం అన్నారు.

**స్వామివారు:** 'ఆత్మోపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున'

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** ఇందాక మీరు అరిషడ్వర్గాల గురించి ప్రస్తావించారు. కామ, క్రోధ, మద మోహ, లోభ, మాత్సర్యాలు.

**స్వామివారు:** లోభ కారణం చేత కామం.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** లోభానికి ఒక కొసన కామం, మరొక కొసన క్రోధం. కామం నెరవేరక పోతే క్రోధం. క్రోధం తనని కాలుస్తుంది, ఇతరులనూ కాల్చేస్తుంది.

**స్వామివారు:** కానీ ఇప్పటి కాలంలో అది కూడా అవసరం లేదు. కారణాతీతంగా, కారణ రహితంగా కూడా కామము క్రోధము రావచ్చు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** ఇందాక, అంతఃకరణ శుద్ధి అన్నప్పుడు నాకు ఒక మాట గుర్తుకొస్తోంది. ఎన్‌లైట్‌మెంట్ అంటూ ఉంటారు ఇప్పటి పిల్లలు. అంటే అన్ని విషయాల పట్ల సమగ్రదృష్టి కలిగి, సమ్యక్‌దృష్టి అవగాహన కలిగి ఉండటం. తనలోనికి తాను తొంగి చూసుకుని ఆత్మవిమర్శ చేసుకోవటం. ఇవన్నీ చెప్పటానికి నా బోటివాడికి బానే ఉన్నాయి కానీ వీటిని సాధించటం ఎలా ?

**స్వామివారు:** ఈ కాలంలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అంటున్నారు. మనం స్వచ్ఛంగా ఉన్నా,

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** ఇతరులు ఉండనివ్వరు.

**స్వామివారు :** ఆ... అవును. ఆకాశంలో గాలి కలుషితం అంటున్నారు. మనం మన గదిలో శుభ్రంగా ఉన్నా పర్యావరణం కలుషితం అయితే దాని ప్రభావం వలన మనలో కూడా మార్పు వస్తుంది. మనకి కూడా హాని కలిగిస్తుంది. సాత్త్విక ప్రవృత్తి సర్వతోముఖంగా సర్వత్ర ప్రసరింప చేస్తేనే వ్యక్తిలో స్వాత్విక వికాసం కలుగుతుంది. అందుకని వ్యక్తి సాధన చెయ్యటం ముఖ్యం. ఒకవేళ ప్రక్క ఇంట్లో మనకు నచ్చని వేరే విషయాలు ఏవైనా

ఉంటే వాటి ప్రభావం మనలో కూడా ఉంటుంది. అందుకని పర్యావరణం కూడా బావుండాలి. దానికి సాత్త్వికప్రవృత్తి అందరిలో కలిగించేటట్లు మనం ప్రయత్నం చెయ్యాలి. భగవద్గీతలో – 'మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే, యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః – 'అనేక జన్మ సంసిద్ధః తతో యాతిపరాంగతిం' – 'తపస్విభ్యో అధికో యోగీ, యోగిభ్యోపిమతోధికః' – 'తస్మాత్ యోగీ భవార్జున' – 'జ్ఞానీతు ఆత్మైవ మే మతం' – ఇలా క్రమక్రమంగా ఆధ్యాత్మిక వికాసం మనుష్యుల యొక్క మనస్సులో కలుగుతూ ఉంటుంది.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** **మీరు ఈ తరాన్ని చూస్తూ ఉండి ఉంటారు. పిల్లలు బుద్ధిగా కూర్చుని మీరు చెప్పేవన్నీ వింటూ ఉంటారు. గుళ్ళకు వెళుతూ ఉంటారు. ప్రదక్షిణలు చేస్తూ ఉంటారు. కొబ్బరికాయలు కొడుతూ ఉంటారు. చిలుకూరి బాలాజీ దేవాలయంలో చూశాను. అందరూ ఇరవై, ఇరవైరెండు, ఇరవైమూడు ఏళ్ళ పిల్లలే ఉంటారు. అలాగే శ్రీజగ్గీవాసుదేవ్‌గారి దగ్గర కానీండీ, శ్రీరవిశంకర్‌గారి దగ్గర కానీండీ పిల్లలు, యువత ఉంటారు. ధ్యానం చేసేవారు కూడా ఎక్కువ మంది యువతీ యువకులే ఉంటారు. ఈ భక్తి వరకు నాకు సంతోషం కలిగిస్తోంది. కానీ సాంప్రదాయం పట్ల, కట్టుబాట్ల పట్ల, ఆచార వ్యవహారాల పట్ల, వేషధారణ పట్ల వీళ్ళింకా విముఖంగానే ఉన్నారు. పాశ్చాత్య ధోరణిలోనే ఉన్నారు. ఈ సమన్వయం ఎలా సాధించాలి అంటారు ? పిల్లల్లో ఆ ప్రేరణ ఎలా కలిగించాలంటారు?**

**స్వామివారు :** ఎక్కడ ఈ విషయాలు నేర్చుకోవాలో అక్కడ నేర్చుకోవాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ :** తల్లిదండ్రులు చెప్పాలి.

**స్వామివారు :** ఆ... తల్లిదండ్రులు చెప్పాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ :** **గురువులు చెప్పాలి.**

**స్వామివారు :** గురువులు చెప్పాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ :** సమయం కేటాయించాలి. దాని కోసం క్రమశిక్షణ పెద్దబాలశిక్షలాగా ప్రతినిత్యం అలవాటులోకి రావాలి. రెండవది అవగాహన రావాలి. పాశ్చాత్యమంటే ఏమి ? సనాతనధర్మం, హిందూధర్మం, వైదికధర్మం అంటే ఏమిటో వారు తెలుసుకోవాలి. పాఠ్యక్రమాలు లేవు. చెప్పేవారు లేరు. చెప్పినా వినేవారు లేరు.

**స్వామివారు :** ఏ చదువు ?


**శ్రీ ప్రయాగ రామకృష్ణ :** **ఏ చదువైనా, ప్రాథమికపాఠశాల, ఉన్నతపాఠశాల, కళాశాల స్థాయి ఏదైనా కానివ్వండి.**

**స్వామివారు :** రెండు విద్యలూ సరిగా లేవు. 'ఇతో భ్రష్టః తతో భ్రష్టః' అన్నట్లు లౌకిక చదువులో నైపుణ్యం, కుశాగ్రబుద్ధి తగ్గింది. అటు ధర్మప్రచారం అసలు లేదు. కాబట్టి దాని గురించి ప్రశ్నే లేదు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ :** **మరి మాతృభాష ?**

**స్వామివారు :** మాతృభాషది కూడా అదే పరిస్థితి. మాతృభాష ప్రచారం జరగాలి. తమిళ, తెలుగు, కన్నడ ఏ భాష అయినా మాతృభాష వృద్ధి చెందాలి. విద్యావిధానంలో మార్పు రావాలి. దానికి ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు అన్నీ ప్రయత్నం చేయాలి. దాంట్లో ప్రెషర్ కూడా ఎక్కువ ఉంది. స్వతంత్రం ఎక్కడ ఉండాలో అక్కడ లేదు. ఎక్కడ అవసరం లేదో అక్కడ ఉంది. అందుకని మన దేశంలో కూడా భద్రత, వికాసం, సౌజన్యం, మైత్రి పెరగాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ :** మీరు ప్రారంభించిన సంప్రదాయ పాఠశాలల్లో ఈ సమతూకాన్ని పాటిస్తున్నారా ?



**స్వామివారు:** ఆ... రెండూ ప్రయత్నం చేస్తున్నాము. లౌకికపరమైన విద్య, దానితోపాటు శాస్త్రీయ సంగీతము, సాహిత్యము, కళలు అన్నీ కలిపి సమగ్రమైన (ఇన్‌క్లూసీవ్ గ్రోత్) అభివృద్ధి కొరకు ప్రయత్నిస్తున్నాము.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** కుటుంబాలు చిన్న కుటుంబాలుగా, చిన్ని కుటుంబాలు మరీ చిన్ని కుటుంబాలుగా మారిపోయాక ఇంట్లో చిన్నపిల్లల సంరక్షణ చూసే వాళ్ళు, వాళ్ళకి విలువలు చెప్పేవాళ్ళు, కథలు చెప్పేవాళ్ళు, అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు కరువయ్యారు.

**స్వామివారు:** అవును !

**శ్రీ ప్రయాగ రామకృష్ణ :** తల్లికీ, తండ్రికీ కూడా క్షణం తీరిక ఉండటం లేదు. విలువల గురించి బాల్యంలో చెప్పటం జరగటం లేదు.

**స్వామివారు:** అవును, కుమార శతకం, కుమారి శతకం, సుమతి శతకం, కాళహస్తీశ్వర శతకం మొదలైనవి చెప్పాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ: ఈ మధ్య ఒకరు వాదించారు, చిన్నపిల్లలకు అవన్నీ చెబితే ఏమి అర్థమౌతాయి ? అని.**

**స్వామివారు :** చెప్పాలి ! కథలు విన్నప్పుడే తరవాత జీవితంలో అలా చేయాలని గుర్తుకువస్తుంది. కాంచీపురం నుంచీ కూడా దాని కోసం ప్రయత్నం చెయ్యాలి అనుకుంటున్నాం. కథ కంచికి వచ్చింది అంటారు, కానీ కంచి నుండి ఈ కథలు మొదలవ్వాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ: ముఖ్యంగా కంచిపీఠం కేవలం ఆధ్యాత్మికం పట్లనే కాదు సామాజికత పట్ల కూడా విశేషమైన కృషి చేస్తోందని నాకే కాదు చాలా మందికి తెలుసు. ఈ సామాజిక అభ్యుదయ కార్యక్రమాలు ఎలాంటి ఫలితాలని ఇస్తున్నాయి ? వీటికి కొనసాగింపుగా మీరు కొత్తగా ఏమి చేయబోతున్నారు ?**

**స్వామివారు:** కొన్ని విషయాలు ప్రభుత్వంవారు చేస్తున్నారు, ఇంకా చేయవచ్చు కూడా. కంచిమఠం తరపున పది కంటి ఆసుపత్రులు, 40 ఇంగ్లీషు మీడియం స్కూల్స్, ఓరియంటల్ స్కూల్స్, వేదపాఠశాలలు, వేదపాఠశాలలలో స్మార్త పాఠశాల, వేద పాఠశాల, విద్యారణ్య భాష్య పాఠశాల, సలక్షణ ఘనపాఠశాల, శ్రౌత పాఠశాల, శాస్త్ర సభలు, తర్కం, వ్యాకరణం, మీమాంస, వేదాంతం వంటి శాస్త్ర పాఠశాలలు జరుగుతున్నాయి. వృద్ధాశ్రమాలు, వికలాంగులకు ఆశ్రమాలు నడిపిస్తున్నారు. ఇలా విద్య, వైద్యం, వేదం మూడు రంగాలలో కూడా యావద్భారతంలో పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు ఒరిస్సాలోని బర్హంపూర్‌లో కొత్త కంటి ఆసుపత్రి నిర్మాణం జయేంద్ర సరస్వతి స్వామివారు ప్రారంభించారు. అలాగే అస్సాంలో కంటి ఆసుపత్రి జరుగుతున్నది. గోవా, సిక్కిం లాంటి సీమప్రాంతాలలో కొత్త గుడులు కట్టాము. అక్కడ పూజలు చక్కగా జరుగుతున్నాయి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ: మణిమండపం అని ఒక గుడిని కంచిలో**



ఓరిక్కై ప్రాంతంలో నిర్మించారు. దాని గురించి చెప్తారా ?

**స్వామివారు:** ఈ శతాబ్దంలో రెండు విషయాలు జరిగాయి. ఒకటి, దేశ స్వాతంత్ర్యం కోసం అందరూ ఆస్తులు పణంగా పెట్టి, పెద్దపెద్ద చదువులు చదువుకున్నవారు కలసి కృషి చేసి అనేక ప్రయత్నాలతో స్వతంత్రభారతం (దేశవిభజన జరిగినా) తీసుకువచ్చారు. రెండవది, వేదాలు, శాస్త్రాలు, సంగీతము, మాతృభాష అభ్యుదయ, అవధానం, చిత్రలేఖనం, శిల్పశాస్త్రం, బుఱ్ఱకథ, మొదలైనవి వ్యాప్తికి కృషి చేశారు. అలాగే సమాజానికి అవసరమైనప్పుడు ధర్మప్రచారము, ధర్మజ్ఞానము, ధర్మవిద్య వంటివి ప్రచారం చేశారు. ఈ విషయంలో ప్రముఖంగా కంచి పరమాచార్యులవారు ధర్మానికి, సమాజానికి సంబంధం ఏమిటి? సంబంధం ఎలా ఉండాలి? చట్టానికి శాస్త్రానికి ఏవిధమైన సౌజన్యం ఉండాలి? ఎలా అవగాహన ఉండాలి? దేశ పరిపాలన, ధర్మప్రచారానికి ఏవిధమైన సంబంధం ఉండాలి? అనేటువంటి విషయాలు ప్రతిపాదించి, ప్రభుత్వపాలనలో, ధర్మప్రచారములో సేవాభావం ముఖ్యమన్న విషయాన్ని నాయకుల మనసుల్లో ఆలోచన కలిగించారు. స్వామివారి సంచారం చేత ప్రభావితమైనవారు పోటీ లేకుండా విద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన విషయంలో పరస్పరం సహకరించు కుంటూ కొంతవరకూ చేశారు.

ఇంకోవైపు కుటుంబ వ్యవస్థ, సదాచారం, భక్తిప్రచారం, వివిధ సంప్రదాయాలలో సమన్వయం, ఆస్తిక్యబుద్ధి, ఇలా రెండూ మార్గాలవాళ్ళు దేశ ఉన్నతికోసం, ధర్మప్రచారంకోసం కలసి పనిచేయటం అవసరం. స్వామివారి ఉద్దేశ్యాలు కాని, ఉపన్యాసాలు కాని, గంభీరంగా, ఔదార్యంతో లలితంగా ఉండేవి. అందువల్ల లాభం ఒక్క కంచిపీఠానికే కాక యావత్ సమాజానికి, విదేశీయులకు కూడా జరిగింది. పాల్‌బ్రంటన్ వంటి వారికి కూడా స్వామివారు జ్ఞానోపదేశం, మార్గదర్శకత్వం చేయటం చూస్తుంటే పరమాచార్యులవారిది పూర్ణావతారం. (అవతారాలలో అంశావతారం, పూర్ణావతారం అని రెండు ఉన్నాయి). వయస్సు కావచ్చు, జ్ఞానం కావచ్చు, వారి మనస్సు కావచ్చు వీటి దృష్ట్యా వారిది పూర్ణావతారము.

స్వామివారు చేపట్టిన కార్యక్రమాలలో శిల్పశాస్త్రం కూడా ఒకటి. దానికొరకు ఒక స్ఫూర్తి కేంద్రం, స్మృతి కేంద్రం, సన్మానించుటకు ఒక కేంద్రం వంటివి చేయించారు. తంజావూర్ బృహదీశ్వరాలయం పద్ధతిలో ఓరిక్కైలో హైదరాబాద్ వాస్తవ్యులు, ఎన్నో దేవాలయాలు నిర్మించిన, పునరుద్ధరించిన, పద్మశ్రీ గణపతిస్థపతిగారితో వారి అబ్బాయితో సంప్రదించి పూర్తిగా రాయితో ఈ మణిమండపం కట్టడం జరిగింది. రథం, అశ్వాలు, గజం, నంది, ప్రహరీ అంతా బృహదీశ్వరాలయంలో ఉన్నట్లుగా రాయితోనే కట్టారు. చాలా కాలం తర్వాత రాయితోనే ఇంత విస్తృతమైన, శిల్పసంపద కలిగిన ఈ మందిర నిర్మాణం ఒక విశేషం. స్వామివారికి సమర్పణగా దీనిని చేశారు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ:** చంద్రశేఖర విశ్వవిద్యాలయంలో కూడా






ఈ శిల్పశాలలు, విద్యార్థులు చేసిన నమూనాలు చూశాను.

**స్వామివారు:** అవును, శిల్పశాస్త్ర పాఠశాల అక్కడ కూడా ఉంది. కశ్యప సంహిత, మరీచి సంహిత అని శిల్పశాస్త్రాలు చదువుతున్నారు. అక్కడ మన జయేంద్రసరస్వతిస్వామివారు ఒకే రాయితో చేయబడిన ఆదిశంకరాచార్యులవారి మూర్తిని స్థాపించియున్నారు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : మీ డీమ్డ్ యూనివర్సిటీలో అద్వైత సిద్ధాంతం మీద ప్రత్యేక విభాగం ఏమైనా ఉందా ?**

**స్వామివారు:** సంస్కృత విభాగం ఉంది. అప్పుడప్పుడు సెమినార్లు, సంబోధనలు చేస్తుంటారు. అక్కడక్కడ దాంట్లో ఆయుర్వేదం గురించి కూడా చెబుతారు. భారతీయ ఇతిహాసము, సంస్కృతము, అద్వైతం ఇవన్నీ కలిపి లౌకిక విద్యతో పాటు వారికి నేర్పుతారు. అంటే విదేశాలలో మేజర్ సబ్జక్ట్, మైనర్ సబ్జక్ట్ అని ఎలా ఉంటాయో అలా నేర్పుతారు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ: మాటల సందర్భంలో పుష్కరాల ప్రస్తావన తెచ్చారు ?**

**స్వామివారు:** దేవగురు బృహస్పతి ఒక్కొక్క రాశి ప్రవేశం ఒక్కొక్క సంవత్సరం చేస్తారు. సింహరాశి ప్రవేశంలో గోదావరిపుష్కరం, కన్యారాశి ప్రవేశంలో కృష్ణాపుష్కరం, తులారాశి ప్రవేశంలో కావేరిపుష్కరం, వృశ్చికరాశి ప్రవేశంలో తామ్రపర్ణి పుష్కరం జరుగుతాయి. ఇప్పుడు నవరాత్రి సందర్భంలో మధురై ప్రక్కన ఉన్న తిరునల్వేలి లోని శాలివాటీశ్వరస్వామి క్షేత్రంలో ఈ పన్నెండు రోజులు పుష్కరం జరగడానికి ఏర్పాటు చేస్తున్నాము. (ఈ ఇంటర్వ్యూ 2018లో జరిగింది) తామ్రపర్ణి అనే మాటను ద్వాదశ జ్యోతిర్లింగస్తోత్రంలో శంకరాచార్యులు వాడారు. 'శ్రీతామ్రపర్ణి జలరాశి యోగే నిబధ్య సేతుం సతతం మునీంద్రైః, శ్రీరామచంద్రేణ సమర్పితం తం రామేశ్వరం సతతం నమామి' ఈ స్తోత్రంలో తామ్రపర్ణి సముద్ర సంగమం ప్రక్కన రామేశ్వరం ఉందని సూచిస్తున్నారు. అక్కడ జపాలు, హోమాలు, సంగీతకచేరీలు, ప్రవచనాలు, సామాజిక కార్యక్రమాలు జరగబోతున్నాయి. శ్రీజయేంద్ర సరస్వతి గోల్డెన్‌జూబ్లీ స్కూల్, శ్రీ జయేంద్ర సరస్వతి సిల్వర్‌జూబ్లీ స్కూల్ అని రెండు ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఉన్నాయి. అక్కడ కంచిపీఠ మఠం కూడా ఉన్నది. ఇవి కాక కంచి పరమాచార్యులవారు ఆదేశించిన శివక్షేత్రం కూడా ఒకటి ఉంది. ఆ క్షేత్రానికి పుటార్జునమని పేరు. సుప్రింకోర్ట్ జస్టిస్ రత్నవేల్ పాండ్యన్‌గారి దగ్గర మహాస్వామివారు దీనిగురించి చెప్పారు. జడ్జిగారి గ్రామ ప్రాశస్త్యాన్ని స్వామివారు చెప్పటం జరిగింది. మీ ఊరికి పుటార్జునమని పేరు. ఇంకో అర్జునమని ఉన్నది. అది మల్లికార్జునం. అంటే శ్రీశైలం. పుటార్జున క్షేత్రానికి మల్లికార్జున క్షేత్రానికి మధ్యనున్న క్షేత్రం మధ్యార్జునం. 'సత్యం అద్వైతం' అని శివుడు పలికిన క్షేత్రం

మధ్యార్జునం. తమిళంలో ఇళైమరదూర్ అంటారు. ఇళై అంటే మధ్య అని అర్థం. ఇప్పుడు ఆ తామ్రపర్ణి తీరంలో, ఈ పుటార్జున క్షేత్రంలో పుష్కరాలు జరగబోతున్నాయి. పరమాచార్యులవారి ఆదేశం ప్రకారం తిరుక్కుడైమరదూర్‌లో జయేంద్రసరస్వతీస్వామివారి చేతుల మీదుగా పుటార్జున క్షేత్రమునకు కుంభాభిషేకం జరిగింది.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : చాతుర్మాస్య దీక్ష అంటే ఏమిటి ?**

**స్వామివారు :** చాతుర్మాస్యమనేది శ్రీమహావిష్ణువు యోగనిద్ర ప్రారంభించే సమయం. అది యోగనిద్ర, మన మాదిరి గాఢనిద్ర కాదు !! (ఆషాఢ శుక్ల ఏకాదశి) రోజు శయన ఏకాదశి మొదలై రెండు మాసాల తర్వాత పరివర్తన ఏకాదశి. (పరివర్తన అంటే తిరగటం, అంటే స్వామి అటూ ఇటూ తిరుగుతారు) మళ్ళీ రెండు మాసాల తర్వాత ఉత్థాన ఏకాదశి. ఆ రోజు లేస్తారని నమ్మకం. సాధారణంగా సన్యాసులు సంచారం చెయ్యాలి. గ్రామం అయితే ఒకరాత్రి, నగరమైతే మూడురోజులు, మహాపట్టణమైతే ఐదురోజులు అని క్రమాలు ఉన్నాయి. 'పరమహంస పరివ్రాజకాచార్య పరితః వ్రజతి గచ్ఛతి' చుట్టూ సంచారం చేయటం పరివ్రాజకత్వం. అలా పరమహంస పరివ్రాజకులు అయినవారు చాతుర్మాస్యంలో ఒక్కచోటే ఉంటారు.

'ప్రాయేణ ప్రావృషి ప్రాణి సంకులం వర్త్మ దృశ్యతే' వర్షాకాలంలో క్రిమికీటకాలు బయట తిరుగుతూ ఉంటాయి. వాటికి పాదయాత్ర వల్ల హాని కలుగుతుంది. అంటే కొంచెం కూడా వాటికి హింస కలిగించకూడదు అనే దృష్టితో సర్వప్రాణి సుఖం కోసం ఒకచోటే ఉండటం జరుగుతుంది.. 'అతస్తేషాం అహింసార్థం పక్షావైః శ్రుతిచోదనాత్ స్థాస్యామః చతురో మాసాన్ అత్రైవ అసతి బాధకే' అని సన్యాసులు అడుగుతారు. దానికి 'నివసంతు సుఖేనాత్ర గమిష్యామః కృతార్థతాం యథాశక్తి చ శుశ్రూషాం కరిష్యామో వయం ముదా' మేము సంతోషంతో సేవలు శుశ్రూషలు చేస్తామని, అనుగ్రహించమని శిష్యులు కోరుకుంటారు. సంవత్సరానికి అవసరమైన ధార్మిక కార్యక్రమాలు, వేదసభలు, శాస్త్రసభలు, పంచాంగ సభ, అద్వైతసభ, అగ్నిహోత్రసభ మొదలైనవి చాతుర్మాస్యంలో చేస్తారు. శిష్యులు అందరూ కూడా ఆ సందర్భంలో వచ్చి పాదపూజ, భిక్షావందనం చేస్తారు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : పరమాచార్య పాదుకాయాత్ర జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అశేష స్పందన లభిస్తోంది.**

**స్వామివారు :** స్వామివారి పాద యాత్రని స్వయంగా సందర్శించే అవకాశం అందరికీ దొరకదు. మహారాష్ట్రలోని సతారా అనే ప్రాంతంలో పరమాచార్యులవారు జయేంద్రసరస్వతిస్వామివారు కలసి శంకరజయంతి ఉత్సవం జరిపించారు. అప్పటికి పరమాచార్యులవారి



వయస్సు 88. అప్పుడు కూడా వారు శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొనటం, జయేంద్రులవారు కూడా ప్రతినిత్యము వేదపారాయణము, విష్ణుసహస్రనామ పారాయణము, సహస్రలింగానికి క్షీరాభిషేకం, (ఆ సహస్రలింగం ఇప్పుడు అలహాబాద్‌లో త్రివేణి సంగమంలో స్థాపించబడింది) (సహస్రలింగానికి పరమాచార్యులవారు స్వయంగా క్షీరాభిషేకం చేశారు) అలా పాదయాత్ర యొక్క వైభవం, స్ఫూర్తి, ప్రేరణ, చైతన్యదాయకంగా మనం సతారాలో చూశాం.

తరవాత కర్ణాటక దేశంలో నీరులేని ఎండాకాలంలో గుల్బర్గా ప్రాంతంలో 89 ఏళ్ళ వయస్సులో మహాస్వామివారు ఒక శివాలయంలో చిన్న కుటీరం ఏర్పర్చుకుని, వసతి లేనిచోట వసతి చేసి ఐదురోజులు శంకరజయంతి ఉత్సవాన్ని జరిపించారు. అంటే వారు శంకర భగవత్పాదుల జయంతి సందర్భంగా ఊరేగింపులు, వేదపారాయణలు జరగాలి, ఆ సమయంలో ప్రజలందరూ కలుసుకోవాలనే దృష్టితో ప్రతినిత్యము సాయంకాలంలో ఊరేగింపుగా పాదయాత్ర చేసి, శంకరాచార్యుల మూర్తికి అలంకారము, అభిషేకము, అర్చనలు చేయించి, వారిపట్ల భక్తిని లోకం తెలుసుకునేటట్లుగా ప్రచారం చేశారు.

ఇప్పుడు వారి యొక్క పాదుకలను ఆంధ్రదేశంలో ప్రతిగ్రామానికి తీసుకువెళ్ళి పూజలు చేయటం, ప్రజలకు ఆ జ్ఞాపకం తీసుకురావటం, ప్రజల మధ్యలో ధర్మాసక్తిని కలిగించటం ఇలా టివి ద్వారా ప్రసారం చెయ్యటం మంచి విషయం. ఈశ్వర అనుగ్రహం అందరికీ వెంటనే దొరకటం చాలా కష్టం. గురువు ద్వారా గురుముఖంగా మనం ఉపదేశం పొంది, వారు చెప్పిన పద్ధతులు మనం అనుసరిస్తూ, ఆచరిస్తూ తద్వారా ఈశ్వరానుగ్రహం పొందటం సులభమైన విషయం, శాస్త్రీయ అనుమతమైన విషయము కూడా. అందుకని ఈ పాదుకారాధనము ద్వారా ఈశ్వర, గురు అనుగ్రహం పొందటానికి అందరూ కూడా ప్రయత్నం చెయ్యాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : స్వధర్మాచరణ !**

**స్వామివారు :** 'శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్' తనకోసం ధర్మాన్ని ఆచరించటం, తనకోసం వండుకుని తినటంవేరు. ఒకరి కోసం ఒకరు వండుకుని తినటం వేరు. స్వార్థపాకం వేరు స్వయంపాకం వేరు. స్వధర్మంలో సంధ్యావందనం చెయ్యాలి, నామజపం చెయ్యాలి. ఒక సందర్భంలో పరమాచార్యులవారు "రామనామమును వ్రాయండి, వ్రాసిన వారికి చంద్రమౌళీశ్వర ప్రసాదం బిల్వపత్రాలు పంపుతామని చెప్పారు, ఎందుకంటే నిత్యం ఉదయం సాయంత్రం భగవంతుని స్మరణ చెయ్యాలి, శివకేశవ స్మరణం చెయ్యాలి" అని చెప్పారు. ఈ విధంగా అందరూ కూడా ఈశ్వర భక్తి, సదాచారంతో వారివారి స్వధర్మాన్ని ఆచరించాలి. కొత్తగా ఉన్న విషయం మనకు ఆశ్చర్యంగా ఉంటుంది, కొన్ని సమయాలలో సంతోషంగా భావిస్తాం కూడా. స్వధర్మాచరణమే మనకు ముఖ్య విషయము, కర్తవ్యము. అందుకని పాశ్చాత్య దృష్ట్యా మనం కొత్త విషయాలు, లౌకికపరంగా




విజ్ఞానమును మనం తెలుసుకున్నా, అనుష్ఠానం, ధర్మం, పుణ్యం విషయంలో మన జుట్టు, కట్టు, బొట్టు, మన ఆచారం, నామజపము, నదీస్నానము ఇలాంటి విషయాలు చేస్తూ ఉండాలి.

స్వధర్మాచరణము అనేది మనకు తెలియకపోయినా, పెద్దవాళ్ళు, మహాత్ములు 'ఏవం పరంపరా ప్రాప్తం' అని చెప్పారో దాన్ని నమ్ముకుని విశ్వసించి మనం స్వధర్మానుష్ఠానం చెయ్యాలి. ఆ స్వధర్మానుష్ఠానం కోసమే పరమాచార్యస్వామివారు ఇంత ప్రయత్నం చేశారు. పాల్‌బ్రంటన్ గారు వచ్చి "మీరే నాకన్నీ నేర్పించవచ్చు కదా" అని అంటే, "నేను ఒక పీఠంలో ఉన్నాను, ఆ పీఠానికి కొన్ని ఆచార, సంప్రదాయ, మర్యాదలు ఉన్నాయి. అందుకని నేర్పేవారిని చూపిస్తాము" అని చెపుతూ ఈ ఆచార ప్రాముఖ్యతను ప్రతిపాదించారు. అందుకని మనం ఈ ఆచార సంప్రదాయాలను పూర్తిగా చేయలేక పోయినా, కొంత సమయమైనా స్వధర్మానుష్ఠానాన్ని చెయ్యాలి. 'శ్రేయాన్ స్వధర్మో విగుణః' అన్నట్లుగా చెయ్యాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : భక్తి, జ్ఞానము ఈ రెండూ వేరు వేరు అంటారా ?**

**స్వామివారు :** భక్తి చేత జ్ఞానము పొందటం జరుగుతుంది. జ్ఞానం అనేది పరిపూర్ణ విషయం. భక్తితో చిత్తశుద్ధిని పొంది కర్మానుష్ఠానాన్ని ఫలాపేక్ష లేకుండా చేస్తూ, కోరిక లేకుండా చిత్తశుద్ధిని పొందితే జ్ఞానం స్వతహాగా మనకు లభిస్తుంది. అందుకని జ్ఞానం పొందటానికి భక్తియుక్తమైన కర్మమార్గాన్ని మనం అనుసరించాలి.



'నేను చేస్తున్నాను, నేను ఒక్కడినే చేస్తున్నాను', అన్న భావన త్యజించాలి. అంటే భక్తి కావాలి. భక్తి ఉంటేనే వినమ్రత వస్తుంది. అందుకని భక్తియుక్తమైన కర్మమార్గము 'కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన'.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : నవవిధ మార్గాలలో ఏది ప్రశస్తమైనది ? ఏది సర్వత్రా అనుసరించతగినది ?**

**స్వామివారు :** మొదటి మూడు అందరూ చేయగలిగే సులభమైనవి. శ్రవణం, కీర్తనం, స్మరణం. స్మరణాదరుణాచలం. దాని తరువాత ఉండే విషయాలు ఎవరెవరికి ఎప్పుడు అవసరమో, ఎలా అవకాశమో దాని బట్టి చెయ్యవచ్చు. (శ్రవణం, కీర్తనం, స్మరణం, అర్చనం, వందనం, దాస్యం...) వందనం అంటే ఆలయానికి వెళ్ళి చెయ్యాలి, దాస్యం అంటే ఎక్కడో సేవ చెయ్యాలి, సఖ్యం అంటే మనం అంత పెద్ద గొప్పవాళ్ళమేం కాదు, 'హే కృష్ణ హే మాధవ హే సఖేతి – అజానతా మహిమానం' అని అన్నారు. ఆత్మనివేదనం సరే ! నివేదనే చెయ్యనప్పుడు ఆత్మనివేదనం ఎలా చేస్తాము. వేదన లేకుండా ఉండాలి. అయితే శ్రవణం, కీర్తనం, స్మరణం ఈ మూడు మనం వెంటనే చెయ్యాల్సిన విషయాలు.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : జయజయ శంకర టివి వరుసగా రెండు సంవత్సరాలు మీ ఆశీస్సులతో పూర్తి చేసుకుంది. మూడవ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది అనుకుంటా !**

**స్వామివారు :** ఈ విజ్ఞాన యుగంలో మనకు అవసరమైన, అవసరంలేని, హానికరమైన విషయాలు మన దగ్గరకు వస్తాయి. ఇప్పుడు గురుకులాలు తగ్గిన సమయంలో మంచి విషయాల యొక్క అవసరం ఉన్న సందర్భంలో ఈ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా దేశవిదేశాలలో ఉండే భక్తులకోసం బ్రహ్మోత్సవాలు, పుష్కరాలు, ఉపన్యాసాలు, పాఠ్యాంశాలు ఇలా మన శాస్త్ర, సంప్రదాయాలను తెలిపే ఎన్నో విషయాలను ప్రజల వద్దకు పాలన అంటున్నట్లుగా, ప్రజల వద్దకు ధర్మ ప్రసారం చేయాలి. ఆ కాలంలో వెయ్యిమంది శిష్యులకు పాఠం చెప్పినారు అంటున్నారు. చంద్రశర్మ, ఆదిశేషు అలా చెప్పారు అని అంటారు. అదేవిధంగా ఈ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా శిష్యులను నేరుగా చూడకపోయినా మొత్తానికి ప్రజలకు సందేశాన్నిచ్చే అవకాశం ఉంది కనుక దాన్ని ఉపయోగిస్తూ మంచి కార్యక్రమాలు చేస్తూ ఉండాలి.

**శ్రీ ప్రయాగ రామకృష్ణ : ధన్యవాదాలు ! జయజయ శంకర టివి మీకు కృతజ్ఞతలు తెలియచేస్తోంది. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు!**

**స్వామివారు :** (నవ్వుతూ) మీరు 'సాహిత్యము, సౌజన్యము, సారాంశము' అనే ముగ్గురి రూపంలో ఇక్కడ కలిసినారు. *

# ప్రాతిశాఖ్య సదస్సు

పూజ్య శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామివారి దివ్య ఆశీస్సులతో కాకినాడ గోశాలలోని శ్రీమఠం క్యాంపులో 6/8/2022 నుండి 8/8/2022 వరకు ప్రాతిశాఖ్య సదస్సు జరిగింది. మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ ముల్లైవాసల్ కృష్ణమూర్తిశాస్త్రిగారు మరియు మహామహోపాధ్యాయ బ్రహ్మ శ్రీ విష్ణుభట్ల సలక్షణఘనపాఠిగారి నేతృత్వంలో ఋగ్వేద, యజుర్వేద శాఖా విద్వాంసుల ఋగ్వేద ప్రాతిశాఖ్యమ్, వ్యాళిశిక్షా, కౌండిన్యశిక్షా, శిక్షాప్రాతిశాఖ్యసమన్వయ మీమాంసా, వర్ణక్రమపారాయణమ్ జరిగినాయి.

కొన్ని అంశాలపై క్లుప్త చర్చలు కూడా జరిగాయి. శిక్షపై మహామహోపాధ్యాయ బ్రహ్మ శ్రీ ముల్లైవాసల్ కృష్ణమూర్తిశాస్త్రిగారు, మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సలక్షణఘనపాఠీగార్లలచే ప్రత్యేక ప్రసంగాలు జరిగాయి. స్వామివారు షడంగ అధ్యయనం యొక్క ప్రాముఖ్యత, శిక్షా సూక్ష్మ నైపుణ్యాల గురించి మాట్లాడి, పాల్గొన్నవారిని ఆశీర్వదించారు. విద్వాంసులందరినీ ఆయన సన్నిధిలో సత్కరించారు.

షడంగంలో మొదటి అంగం శిక్ష. ఇది శబ్దశాస్త్రానికి సంబంధించి నది. ప్రాతిశాఖ్యం అనేది శబ్దశాస్త్రానికి సంబంధించిన పుస్తకం. ప్రతి వేదానికి దాని స్వంత ప్రాతిశాఖ్య /శిక్ష ఉంటుంది.

**ఋగ్వేద సలక్షణ ఘనపాఠి విద్వాంసులు**

బ్రహ్మశ్రీ బి.వి. సూర్యనారాయణభట్, బ్రహ్మశ్రీ రత్నాకరభట్, బ్రహ్మశ్రీ దామోదరభట్, బ్రహ్మశ్రీ గోవిందప్రకాశభట్, బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్య ఘనపాఠి, బ్రహ్మశ్రీ కుమార ఘనపాఠి, బ్రహ్మశ్రీ గణేశ ఘనపాఠి, బ్రహ్మశ్రీ శ్రీనివాసశర్మ మొదలైన ఋగ్వేదసలక్షణఘనపాఠీలు ప్రాతిశాఖ్య సదస్సులో పాల్గొన్నారు.

**యజుర్వేద సలక్షణ ఘనపాఠి విద్వాంసులు**

బ్రహ్మశ్రీ ఆర్. కృష్ణమూర్తిశాస్త్రి , బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సుబ్రహ్మణ్య ఘనపాఠి, బ్రహ్మశ్రీ వి. జంబునాథ ఘనపాఠి, బ్రహ్మశ్రీ వి. శ్రీరామ ఘనపాఠి, బ్రహ్మశ్రీ ఆర్. శ్రీకృష్ణ ఘనపాఠి, బ్రహ్మశ్రీ సి. వెంకటకృష్ణ ఘనపాఠి, బ్రహ్మశ్రీ హరి సీతారామమూర్తి ఘనపాఠి, బ్రహ్మశ్రీ కనక సభాపతి ఘనపాఠి,బ్రహ్మశ్రీ గోపాలకృష్ణ ఘనపాఠి, బ్రహ్మశ్రీ స్వర్ణసభేశ ఘనపాఠి, బ్రహ్మశ్రీ సేతురామ ఘనపాఠి, బ్రహ్మశ్రీ సుబ్బు వెంకట్రామ ఘనపాఠి, బ్రహ్మశ్రీ ఆత్రేయ ఘనపాఠి, బ్రహ్మశ్రీ నిరంజన ఘనపాఠి, బ్రహ్మశ్రీ బి. శ్రీరామ ఘనపాఠి, బ్రహ్మశ్రీ హరిహరసుబ్రహ్మణ్య ఘనపాఠి, బ్రహ్మశ్రీ శరశ్చంద్ర ఘనపాఠి, బ్రహ్మశ్రీ బి. శ్రీకృష్ణ ఘనపాఠి, బ్రహ్మశ్రీ శివరామ ఘనపాఠి, బ్రహ్మశ్రీ వి. సుబ్రహ్మణ్య శాస్త్రి, బ్రహ్మశ్రీ కపిలవాయి రైవత ఘనపాఠి, బ్రహ్మశ్రీ షడక్షర ఘనపాఠి మొదలైనవారు పాల్గొన్నారు. *



# దేవాదాయశాఖ ప్రతినిధులకు కార్యాచరణ కార్యక్రమము

పూజ్య శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ శంకరాచార్య స్వామివారి ఆశీస్సులతో కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడలో పనిచేస్తున్న గెజిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, గ్రేడ్-1, 2, 3 ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ ఆఫీసర్‌లకు పశ్చిమ గోదావరి మరియు ఏలూరు వసంత మండపం హాల్, కాకినాడలోని గోశాల, శ్రీమఠం క్యాంపు వద్ద 29/7/2022 నాడు రోజంతా ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి కోట సత్యనారాయణగారు హాజరయ్యారు.

దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు మరియు సీనియర్ ఆఫీసర్లు ఆలయ సంప్రదాయాలు, ఆచారాలు మరియు వినియోగంపై దృష్టి సారించడానికి, మెరుగైన పరిపాలన కోసం ఆలయాల్లోని శాస్త్రాలు / ఆగమాల ప్రకారం విధానాలను అనుసరించడానికి శిక్షణా కార్యక్రమం ఉద్దేశించబడింది.

ఈ కార్యక్రమం శ్రీ కంచి కామకోటిపీఠం శ్రీకార్యంవారు శ్రీ చల్లా విశ్వనాథశాస్త్రిగారు ఉదయం 9 గంటలకు ప్రారంభించి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. ఉదయం సెషన్‌లో శ్రీ ధూళిపాళ రామకృష్ణ శాస్త్రిగారు, శ్రీ విశ్వనాథం గోపాలకృష్ణశాస్త్రిగారు, శ్రీ రాంలాల్‌శర్మగారు అనేక అంశాలపై ప్రత్యేక ప్రసంగాలు చేశారు.

1. ఆగమోక్తరీత్యా దేవాలయం అనేది ఏమిటి ?

2. దేవాలయ చైతన్యానికి మంత్ర ఉచ్చారణ ప్రాముఖ్యత, ద్రవ్య శుద్ధి ప్రాముఖ్యత, స్థల శుద్ధి ప్రాముఖ్యత

3. ఆలయ అభివృద్ధిలో దాతలకు ఛారిటీ గైడెన్స్ మొదటి సెషన్ అనంతరం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసారు. అనంతరం శ్రీమఠం శిబిరంలో ప్రసాద వితరణ చేశారు.





స్వామివారి సన్నిధిలో మధ్యాహ్నం సెషన్ ప్రారంభమైంది. శ్రీ చాగంటి కోటేశ్వరరావుగారు ఆలయ నిర్వహణ, భక్తులకు కావాల్సిన సౌకార్యాలు గురించి మాట్లాడారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ హరి జవహర్‌లాల్‌గారు, దేవాదాయ శాఖ మంత్రి శ్రీ కోట సత్యనారాయణగారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గెంటెల వెంకటరమణగారు కూడా పాల్గొన్నారు. స్వామివారు తన అనుగ్రహ భాషణంలో దేవాలయాలు మరియు పవిత్ర స్థలాలను నిర్వహించేటప్పుడు సేవాభావంతో ఉండి అహంభావాన్ని ప్రాథమికంగా తొలగించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భక్తులకు చిరస్మరణీయమైన దర్శన అనుభూతిని పొందేందుకు వీలుగా ఉత్తమ విధానాలను అనుసరించడం గురించి ఆయన మాట్లాడుతూ, ఆలయాల్లో ప్రజలకు సేవ చేసేందుకు అధికారులకు అత్యుత్తమ అవకాశం లభిస్తుందని అన్నారు. గతంలో కంచి మహాస్వామివారు, జయేంద్రసరస్వతి స్వామివారు ఆలయ వ్యవహారాల్లో ఆ శాఖలకు మార్గనిర్దేశం చేసిన సందర్భాలను కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. ఉత్తర భారతదేశంతో పోలిస్తే రాజవీధులు, మాడవీధులు, ఉత్సవ సంప్రదాయాలతో పాటు అనేక ఆలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా దక్షిణ భారతదేశంలో ఉన్నాయని, ఒక విధంగా అది అదృష్టమని ఆయన అన్నారు.

పూజ్య శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు తన విజయయాత్రల సమయంలో సందర్శించిన నేపాల్‌లోని పర్వత ప్రాంతాలలో ఉన్న దేవాలయాల గురించి, ఇండో–నేపాల్ సరిహద్దులోని నేపాల్‌ద్వార్‌ను గురించి కూడా ఆయన ప్రస్తావించారు. “సర్వే భవన్తు సుఖినః సర్వే సంతు నిరామయాః సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖభాగ్భవేత్”. అని ఆశీర్వదించి కార్యక్రమాన్ని ముగించారు. సభకు హాజరైన అధికారులకు ధర్మప్రచారం కోసం శ్రీమఠం ప్రచురించిన పుస్తకాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. పలువురు ఆలయ అధికారులు స్వామివారికి ఆలయ ప్రసాదాలు అందజేశారు. శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి సన్నిధిలో దీపపూజ జరిగిన అనంతరం శ్రీ ధూళిపాళ రామకృష్ణశాస్త్రిగారు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు, మంత్రిత్వ శాఖ సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల దేవస్థానం, విజయవాడ, శ్రీశైలం, శ్రీ కాళహస్తి, కాణిపాకం కార్యనిర్వాహక అధికారులను శ్రీ కంచి కామకోటి పీఠం కాకినాడలోని గోశాలలో 25/08/22 నుండి 27/08/22 వరకు నిర్వహించే పంచాంగ సదస్సుకు ఆహ్వానించింది. *

# షడంగ వేదవిద్య ప్రాముఖ్యత

కాకినాడలోని గోశాలలో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మ శ్రీ అగ్నిహోత్రి జంబునాథ సలక్షణ ఘనపాఠిగారికి పూజ్య శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు "షడంగవేద ప్రచార రత్నం" బిరుదును ప్రదానం చేశారు. వసంత నవరాత్రుల సందర్భంగా హొస్పేట్‌లో షడంగవేద పారాయణం చేసినందుకు కర్నాటకలోని హొస్పేట్‌లోని విద్యారణ్య విద్యాపీఠం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను కూడా ఆయన అందించారు.

"బ్రాహ్మణేన నిష్కారణేన షడంగో వేదోఽధ్యేయో జ్ఞేయశ్చ"

వేదాలలోని శిక్ష, వ్యాకరణం, చందస్సు, నిరుక్తం, జ్యోతిషం కల్పం అనే షడంగాలతో పాటు వాటి అర్థాన్ని కూడా నేర్చుకోవాలని చెబుతారు. పూజ్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి వారు హొస్పేట్‌కు పాద యాత్ర చేస్తున్న సమయంలో వేదాలు, షడంగ బోధించే విద్యారణ్య విద్యా పీఠాన్ని ప్రారంభించాలని ఆశీర్వదించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు శ్రీ రామేశ్వరఅవధానిగారు శిక్షణ ఇచ్చిన ఘనపాఠీలలో బ్రహ్మశ్రీ జంబునాథ సలక్షణఘనపాఠీలలో ఒకరు. ఇప్పుడు విజయనగర జిల్లాగా పిలువబడుతున్న హంపి, హొస్పేట్ ప్రాంతాలు వేదాలపై వ్యాఖ్యానం రాసిన విద్యారణ్య మహర్షికి చెందినవి. వేదాల అర్థాన్ని అర్థం చేసుకోవడానికి షడంగం నేర్చుకోవడం ప్రాథమికమైనది. ఆ ప్రదేశంలోనే ఈ సంప్రదాయాన్ని పునరుద్ధరించాలని కంచి మహాస్వామి కోరిక.

పూజ్య శ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు కర్నాటక రాష్ట్రంలో పాద యాత్ర సందర్భంగా డెబ్బైల చివరలో చంద్రమౌళీశ్వరస్వామి పూజతో విద్యాపీఠంలో విడిది చేశారు. ఇటీవలే 2009/10లో శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు, పాఠశాలలో కర్ణాటక వేద విద్యార్థి సమ్మేళనానికి వెళ్ళి వారిని ఆశీర్వదించారు. ఇక్కడ సుమారు 400 మంది పిల్లలు సమావేశమై శ్రీ స్వామివారి దివ్య సన్నిధిలో దీపావళి జరుపుకున్నారు.

పూజ్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి వారు ఇటీవల ఆ ప్రాంతంలో యాత్ర చేస్తున్న సమయంలో, వసంత నవరాత్రి సందర్భంగా విద్యారణ్య విద్యాపీఠంలో ఆయన విడిది చేశారు. బ్రహ్మశ్రీ జంబునాథఘనపాఠి, స్వామివారి ఆదేశానుసారం విద్యారణ్య విద్యామహోత్సవంలో వేదపారాయణంతో పాటు షడంగ పారాయణం చేయడానికి తన విద్యార్థులను పంపారు. పలువురు ఇతర పండితులు కూడా పాల్గొని వేద భాష్య పారాయణం మరియు విద్యారణ్య మహర్షి యొక్క ఇతర రచనలను ప్రదర్శించారు. ఇక్కడ కొత్త విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇచ్చి మరీ షడంగంలో శిక్షణ ఇవ్వడం అభినందనీయం.





ఈ సందర్భంగా స్వామివారు అనుగ్రహభాషణం చేస్తూ వేదవిద్యను ప్రోత్సహించడం, పండితులను ఆదరించడం, పాత సంప్రదాయాలను పునరుద్ధరించడం, మన పూర్వాచారాలను ఆచరించడం అవసరమన్నారు. మానుకోవాల్సిన అలవాట్లపై అంకుశం (నియంత్రణ/క్రమశిక్షణ) పెట్టాలని, ధర్మ విద్యను పెంపొందించేందుకు అంకురం (విత్తనం/పునాది) నాటాలని ఆయన అన్నారు. ధార్మిక సంప్రదాయాలు పెంపొందించే నర్సరీని పెంచి ప్రస్తుత, భవిష్యత్తు తరాలకు ప్రయోజనం చేకూర్చాల్సిన అవసరం ఉందని స్వామివారు అన్నారు.

మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ ముల్లైవాసల్ కృష్ణమూర్తిశాస్త్రిగారు బిరుదుపత్రాన్ని చదవగా, శ్రీ చాగంటి కోటేశ్వరరావుగారు బ్రహ్మశ్రీ జంబునాథసలక్షణఘనపాఠిగారికి శాలువా కప్పి సత్కరించారు. ఘనపాఠిగారి శిష్యులను కూడా శాలువాలతో, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

**హోస్పేట్ నవరాత్రి ఉత్సవాలలో విద్యారణ్య విద్యామహోత్సవంలో పాల్గొన్న వేదపండితులు**

బ్రహ్మ శ్రీ మహామోపాధ్యాయ ఆర్. కృష్ణమూర్తిశాస్త్రి – వేదభాష్యం, శ్రీ ఎస్. గురునాథన్ గణపతి – వేదభాష్యం, శ్రీ చంద్రమౌళీశ్వర గణపతి – వేదభాష్యం, శ్రీ ఆర్. శ్రీకృష్ణ గణపతి – వేదభాష్యం, శ్రీ బి. కృపాశంకర ఘనపాఠి – వేదభాష్యం, శ్రీ ఎస్. రామకృష్ణ ఘనపాఠి – వేదభాష్యం, శ్రీ జి. హరి హర రాఘవేంద్రన్ వేదభాష్యం, శ్రీ కె. ఆదికేశవన్ – వేదభాష్యం, శ్రీ మాధవ శర్మ – వేదభాష్యం, శ్రీ ఎస్. రత్నగిరీశ్వరన్ వైయాకరణ మాధవీయ ధాతు వృత్తిహి, శ్రీ నిధీశ్వరశర్మ – కాలమాధవీయం వేదసార సహస్రం, సామ వేద భాష్య భూమికా, శ్రీ డా. రేమెళ్ల రామ సోమయాజులు సీనియర్ వేద పండితులు – ఉపన్యాసం, శ్రీ బ్రహ్మ శ్రీ శ్రీరమణ శర్మ – దహర విద్యా ప్రకాశిక, శ్రీ డాక్టర్ ఎస్. వేణుగోపాలన్ – పురుషార్థ సుధానిధి, శ్రీ కుమారశాస్త్రి – శాయనభాష్యం, శ్రీ బ్రహ్మ శ్రీ ఆర్. మణి ద్రావిడ్ – పంచదశి, శ్రీ డాక్టర్ శంకర్ నగేష్ భట్ – పంచదశి, శ్రీ ఆర్. శ్రీగోపాల్ – న్యాయమాల, శ్రీ సి. హెచ్. శ్రీరామశర్మ విద్యారణ్య – భాష్య పారాయణం, శ్రీ ఎం. ఆర్. వెంకటేశ అవధాని – అనుభవ ప్రకాశం, శ్రీ పద్మనాభ్ సునీల్ కర్లేకర్ – కృష్ణయజుర్వేద సంహిత మూలం, శ్రీ నాగరాజ్ వెంకట్రామన్ భట్ – కృష్ణయజుర్వేద సంహిత మూలం, శ్రీ జి. శ్రీహర్ష – కాల మాధవీయభాష్యం, శ్రీ ఆర్. నీలకంఠశాస్త్రి – పరాశర మాధవీయం, శ్రీ ఆర్. సుబ్రహ్మణ్య ఘనపాఠి – చతుర్వేద భాష్య భూమిక, శ్రీ జి. కనకసభాపతి దీక్షితార్ – కృష్ణయజుర్వేద మూల సహిత షడంగం.

**కృష్ణయజుర్వేద మూల సహిత షడంగ పారాయణం**

శ్రీ ఆర్.గోపాలకృష్ణ గణపతి, శ్రీ నిరంజన్. ఎం శాస్త్రి, శ్రీ జె. శ్రీరామ్ గణపతి, శ్రీ ఎం. నవనీత కృష్ణ గణపతి, శ్రీ ఎన్. కార్తీక్ గణపతి, శ్రీ జె. రాజీవాక్షగణపతి, శ్రీ కె. సుబ్బువెంకట్రామ గణపతి, శ్రీ కె.ఆర్. ఆత్రేయ గణపతి, శ్రీ బి. బద్రీనారాయణ గణపతి, శ్రీ చింతపల్లి వీరఫణిచంద్రశేఖర గణపతి, శ్రీ ఎన్. శేషసాయి, శ్రీ ఎస్. శ్రీవత్సశర్మ, శ్రీ ఎస్. నీరజాక్షశర్మ, శ్రీ జె. పుష్కరాక్షశర్మ, శ్రీ ఎం. సి. ప్రసన్న, శ్రీ ఎం. బాలసుబ్రహ్మణ్యం, శ్రీ ఎం. శ్రీహరిహరన్, శ్రీ ఎస్. అశ్విన్‌శర్మ మొదలైనవారు కార్యక్రమంలో పాల్గొని కృష్ణయజుర్వేద మూలసహిత షడంగ పారాయణం చేశారు.

**కృష్ణయజుర్వేద తైత్తిరీయశాఖ మూల పారాయణం**

శ్రీ మహాబలేశ్వర్ గణపతి, శ్రీ జి.రామకృష్ణ భట్, శ్రీ శశాంక్ పత్కీ, శ్రీ సమర్థ గాగ్రే మొదలైనవారు కృష్ణయజుర్వేద తైత్తిరీయశాఖ మూలపారాయణం చేశారు. *

# కాకినాడ గోశాలలో ఘనంగా జరిగిన కావేరి పూజ - ఆది పెరుక్కు



శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు కాకినాడలోని ఆకొండి లక్ష్మీస్మారక గోశాలలో నిర్వహిస్తున్న చాతుర్మాస్యదీక్ష సందర్భంలో పవిత్ర కావేరీ పూజ-ఆది పెరుక్కు ఉత్సవం ఘనంగా జరిగింది. స్వామివారు అనుగ్రహ భాషణం చేస్తూ భారతదేశంలో నదులను దైవంగా పూజిస్తామని, జాతీయ భావము, సాంస్కృతిక ఏకత్వం పెంపొందడానికి ఆది పెరుక్కు వంటి పండుగలను విశేషంగా జరుపుకోవాలని అన్నారు.

ముందుగా భక్తులకు తీర్థ మహాత్మ్యంపై అవగాహన కలిగించేందుకు రంగంజీగారిచే తమిళంలో ఉపన్యాసం జరిగింది. ఆయన తమిళనాడు సంస్కృతి గురించి, ఆది పెరుక్కు ఉత్సవాల్లో చేసే ప్రత్యేక నైవేద్యాల గురించి భక్తులకు తెలియజేసారు.

గోశాల సమీపంలోని మందిరంలో ఒక కలశంలో కావేరి జలాన్ని తెచ్చి, కావేరి అష్టోత్తరంతోను, షోడశోపచారాలతో శ్రీమఠంకు చెందిన పండితులు, ఇంకా తిరువానైక్కావల్ వేదపాఠశాలకు చెందిన వేదవిద్యార్థులు పూజించారు. సువాసినులు హారతులు ఇచ్చారు. అనంతరం కలశ తీర్థాన్ని ప్రసాదంగా అందరికీ అందజేశారు.

*




శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి సన్నిధిలో శైవాగమ సదస్సు జరిగింది. 'అష్టప్రకరణమ్' అనే పుస్తకావిష్కరణ స్వామివారి చేతుల మీదుగా జరిగింది.






వేదవిద్య పూర్తిచేసుకున్న విద్యార్థులకు స్వామివారు ప్రమాణపత్రములను అనుగ్రహించారు.



స్వామివారి చాతుర్మాస్యదీక్ష సందర్భంగా కాకినాడలో వార్షిక పంచాంగ సదస్సు జరిగింది. అనేక మంది పంచాంగ కర్తలు, జ్యోతిష్యపండితులు ఈ సదస్సుకు హాజరై స్వామివారి ఆశీస్సులను పొందారు.



# కేరళలోని శ్రీ కామకోటి పీఠాన్ని దర్శించుకున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ

శ్రీ ఆదిశంకరాచార్యులవారి
కీర్తి స్తంభ మండపం వద్ద
శ్రీ నరేంద్రమోదీ

శ్రీమఠం పండితులు పూర్ణకుంభంతో ఎదురువెళ్ళి, స్వస్తివచనాలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీని ఆశీర్వదించారు. ఆ తర్వాత వారు మఠంలో పూజలు నిర్వహించారు.



# దేవుని స్వరం పుస్తకావిష్కరణ మహోత్సవం

**జగద్గురు పూజ్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర మహాస్వామివారి దివ్య ప్రసంగాల సమాహారం 'దేవుని స్వరం' పుస్తకం ఆవిష్కరణ సెప్టెంబర్ 7తేదీ 2022న కాకినాడలో శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతిస్వామివారి సన్నిధిలో అత్యంత గురుపురస్కారంగా జరిగింది. కంచిమహాస్వామి పీఠారోహణ శతాబ్ది ట్రస్ట్ చైర్మెన్ శ్రీ వి. శంకర్‌గారు స్వాగతోపన్యాసం చేశారు.**



**కంచిమహాస్వామి పీఠారోహణ శతాబ్ది ట్రస్ట్ వారు దేవునిస్వరం పుస్తకాన్ని అచ్చువేయించారు. ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులుగారు ఆవిష్కరించారు.**



**శ్రీ చాగంటి కోటేశ్వరరావుగారు ఈ పుస్తక పరిచయం చేయగా, శ్రీచాగంటివారికి 'శ్రీకామకోటి సేవారత్న' బిరుదును ఇచ్చి సత్కరించారు.**



* ఈ సందర్భంగా గ్రంథాన్ని పల్లకీలో గోశాల చుట్టూ ఊరేగింపుగా తీసుకువెళ్ళి వసంతమండపంలోనికి తీసుకువచ్చారు.

* భక్తులు మహాస్వామివారి అధిష్ఠానం, కాంచీపురానికి రాళ్ళు పొదిగిన బంగారు అభయహస్తాన్ని సమర్పించుకున్నారు.

* తదనంతరం స్వామివారు అనుగ్రహభాషణం చేసి సభలో పాల్గొన్నవారందరినీ ఆశీర్వదించారు.



సెప్టెంబర్ 9, 2022న పౌర్ణమి పూజానంతరం స్వామివారు చంద్రదర్శనం చేస్తూ లలితాసహస్రనామ పారాయణ చేయగా పరవశించిన భక్తులు.

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

# మూకపంచశతి – మూక మహాకవి

ఖగోళ జ్యోతిషశాస్త్రవేత్త విద్యావతి కుమారుదు, పుట్టు మూగ చెవిటి వాడైన ఈ కవి అనునిత్యం ఇరుగు వారు తోటి పిల్లలు అవహేళన చేస్తూ ఏడిపిస్తుంటే నిత్యం కంచిలోని శ్రీ కామాక్షీ దేవిని దర్శించి సాష్టాంగ నమస్కారం చేసి ముగ్ధ మనోహరంగా దర్శనమిచ్చే అమ్మవారిని ధ్యానం చేస్తూ మౌనంగా రోదిస్తూ మనశ్శాంతి పొందేవాడు. ఒక రోజు మూక కవితో పాటు మరొక సాధకుడు అమ్మవారి ఎదుట కూర్చుని ధ్యానంలో ఉన్నారు. అమ్మవారు వీరి భక్తికి మెచ్చి అనుగ్రహించాలనే తలంపుతో ఒక సాధారణ స్త్రీగా దర్శనమిచ్చి తననోటిలోని తాంబూలం ముద్ద (పిడచ) కొంత తీసి మూకకవి ప్రక్కనే ఉన్న సాధకునికి ఇచ్చింది. ఆయన ఆమెను ఒక మామూలు స్త్రీ అనుకోని దాన్ని ఎంగిలిగా భావించి తీసుకోలేదు .వెంటనే జగదంబ దానిని మూకకవిని అనుగ్రహించి చేతిలో పెట్టింది .దాన్ని మహా ప్రసాదంగా భావించిన మూకకవి భక్తిగా కళ్ళకు అద్దుకొని నోట్లో వేసుకొన్నాడు .అంతే మూకకవికి మాట వచ్చి మహా ప్రవాహంగా ఆశువుగా కవిత జాలువారి అమ్మవారి దివ్య సుందర విగ్రహాన్ని కనులారా దర్శిస్తూ 500 శ్లోకాలు ఏకధాటిగా చెప్పాడు .అదే మూక పంచశతి. అమ్మవారి గొప్ప తనాన్ని వర్ణించినది ఆర్యా శతకం, అమ్మవారిని స్తుతిస్తూ చెప్పింది స్తుతి శతకం. కనులను వర్ణించేది కటాక్ష శతకం. అమ్మవారి నవ్వును వర్ణిస్తూ చెప్పింది మందస్మిత శతకం. పాదాలను వర్ణిస్తూ చెప్పింది పాదార విండ శతకం.

కంచి కామకోటి పీఠానికి 20 వ పీఠాదిపతిగా క్రీ. శ.398లో అధిరోహించి 27 సంవత్సరాలు 437 వరకు సేవ చేసి అద్వైతమత ప్రచారంలో జన్మ చరితార్థం చేసుకొని గోదావరీ తీరంలో శ్రావణ పూర్ణిమ నాడు సిద్ధి పొందినట్లు చెపుతారు.

మూకకవిని గూర్చి వారి స్తుతిని గూర్చి మహాస్వామివారు పలు సందర్భాల్లో చెపుతూ ఉండేవారు. మూకపంచశతిని కాంచీపురంలోని కామాక్షీదేవాలయపు గోడలపై శాశ్వతంగా ఉండేటట్లు వారే చెక్కించారు.

మూకపంచశతి ప్రౌఢమైన గ్రంథము. దీనిలో చాలా ఉపాసనా రహస్యాలు దాగి ఉన్నాయని పెద్దలు అంటారు. దీనిని బ్రహ్మశ్రీ.కల్లూరి సుబ్రహ్మణ్య దీక్షితులు గారు, బ్రహ్మశ్రీ. దోర్భల విశ్వనాథ శర్మ గారు కావ్య గుణాలను వివరిస్తూ తెలుగులోనికి అనువదించారు.

దీనిని చదివిన వారు పరిపూర్ణంగా అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని మూకమహాకవి ఆ తల్లిని కోరుకున్నారట. ప్రతి శ్లోకమును భావించుకుని చదువుతూంటే ఆ కామాక్షి మన ఎదుటే ఉన్నట్లు భాసిల్లుతుంది.

1. కారణపరచిద్రూపా కాంచీపురసీమ్ని కామపీఠగతా ।
   కాచన విహరతి కరుణా కాశ్మీరస్తబకకోమలాంగలతా ॥

భావము: కారణపరమైన జ్ఞానమే రూపముగా కలిగి, కామపీఠమును నెలకొనినదై, కుంకుమపూవులగుత్తులవలె తీగవంటి కోమలమైన శరీరము కలిగిన ఒకానొక దయ కాంచీపురసీమయందు విహరించుచున్నది.

**బాలమనోజ్ఞ:** ఇక్కడ మూకమహాకవి అమ్మవారిని పేరుతో ఉచ్చరించకుండా ఆవిడ సర్వకారణములకు కారణమైన పరబ్రహ్మగా, జ్ఞానమూర్తిగా, చైతన్య స్వరూపిణిగా వర్ణిస్తున్నారు. ఇంకా ఆవిడ ఎలా ఉన్నదట. కాశ్మీరస్తబకం అంటే కాశ్మీరమునందే విశేషంగా పూసే కుంకమపూవులగుత్తి వలె కోమలంగా ఉన్నదట. కుంకుమపూలలోని రేకులు వంకాయవర్ణంలో ఉండి పై కేసరాలు ఎర్రటి రంగులో ఉంటాయి. కేసరాలను తీసుకుని మనం కుంకుమపువ్వు అని వ్యవహారం చేస్తూంటాము. ఆ తల్లి దేహం కుంకుమపూవుల రేకులు వలె వంగనీలపు వర్ణంలో ఉండి వాటి పైన కేసరాల వలె ఆ తల్లి పెదవులు, స్తనద్వయం, నాభి, అరచేతులు, చిగుటాకుల వంటి పాదములు ఎర్రగా ప్రకాశిస్తున్నాయని కవి మనోభావము. కుంకుమపూవులను స్త్రీరూపంలో ఒక రాశిగా పోసి చూస్తే అక్కడక్కడా వాటి కేసరాలు ఎర్రవిగా ప్రకాశిస్తూ ఉన్న ఆ వ్యక్తావ్యక్తస్వరూపిణికి నమస్కారము.

2. కంచన కాంచీనిలయం కరధృతకోదండబాణసృణిపాశమ్।
   కఠినస్తనభరనమ్రం కైవల్యానందకందమవలమ్బే॥

**భావము:** చేతులయందు ధనుర్బాణ పాశాంకుశములను ధరించి, కఠినస్తనభారములచే వంపు కలిగినదియు, కైవల్యానందమునకు పుట్టినిల్లైన కాంచీనగరములో శ్రేష్ఠముగా ప్రకాశించే ఒకానొక వస్తువును ఆశ్రయించెదను.

**బాలమనోజ్ఞ:** ఇక్కడ తల్లిని స్త్రీరూపంలో గానీ పుంరూపంలో గానీ చెప్పటం లేదు మహాకవి. అంటే పరబ్రహ్మతత్వంగా వర్ణిస్తున్నారు. ఆ పరబ్రహ్మకు రూపం ఉండదు. రూపగుణములు లేని పరబ్రహ్మ. కాని ఈ కాంచీపురంలో ఉన్న బ్రహ్మపదార్థానికి నాలుగు చేతులు ఉండి వాటియందు మనస్సుకు సంకేతమైన ఇక్షుకోదండాన్ని, మన్మథుని బాణాలైన అరవిందము, అశోకము, చూతము, నవమల్లికా, నీలోత్పలము అనే ఐదు బాణములను, కోతి వంటి మన మనస్సులను తన వైపునకు లాగటానికి పాశమును, మదించిన మన ఇంద్రియాలను తనవైపునకు త్రిప్పుకొనటకు అంకుశాన్ని ధరించి ఉన్నది. జన్మనిచ్చిన తల్లి తన శిశువు యొక్క ఆకలిని తీర్చటానికి తన స్తన్యాన్ని అందిస్తుంది. కానీ ఈవిడ జగజ్జనని. భక్తుల జ్ఞానమనే ఆకలిని తీర్చటానికి తన స్తన్యాన్ని ప్రసరిస్తోందా అన్నట్లు ఉన్నదట. ఆ విధంగా కాంచీపురానికి తిలకము వలె శ్రేష్ఠమైనదిగా ప్రకాశిస్తోంది అని మూకకవి వర్ణిస్తున్నారు. అవ్యక్తస్వరూపిణి అని ఆ పరబ్రహ్మ కాంచీనగరంలో కామాక్షీ రూపంలో వ్యక్తమౌతోందని భావము. *



అనేకజన్మసంప్రాప్త కర్మబంధవిదాహినే ।
ఆత్మజ్ఞానప్రదానేన తస్మై శ్రీగురవే నమః ॥